మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 213 | శనివారం | 07 - 02 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. ఇన్వెస్టర్లలో కొత్త ఉత్సాహం..!



4లో..

## జగన్ పరామర్శ రాజకీయాలపై చంద్రబాబు సీరియస్



- బలప్రదర్శనలతో రౌడీయిజం చేయడం సరికాదని వ్యాఖ్య
- టీటీడీ లడ్డూ వివాదంపై తీవ్ర ఆరోపణలు
- రాయలసీమ అభివృద్ధి, పోలవరం పూర్తి లక్ష్యాలపై స్పష్టత

మన గళం, కర్నూలు : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న పరామర్శ యాత్రలపై ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఘాటు వ్యాఖ్యలతో ఎదురుదాడికి దిగారు. పరామర్శల పేరుతో గంటల తరబడి ట్రాఫిక్ ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టడం, బలప్రదర్శనలతో రౌడీయిజం చేయడం తన దగ్గర చెల్లదని స్పష్టం చేశారు. ఇలాంటి రాజకీయాలను ఎలా ఎదుర్కోవాలో తనకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం బలప్రదర్శనలు చేయడం సరికాదని, ఎన్నికల సమయంలోనే సత్తా చాటాలని హితవు పలికారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం కలుగట్లలో నిర్వహించిన "మీ భూమి మీ హక్కు" కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి ఘటనలు ప్రత్యర్థుల రాజకీయ శైలికి నిదర్శనమని విమర్శించారు.

టీటీడీ లడ్డూ ప్రసాదం విషయంలోనూ చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారైన నెయ్యిని ఉపయోగించారన్నారు. ఈ వ్యవహారంలో సీబీఐ, సిట్ క్లీన్ చిట్ ఇచ్చాయని అబద్ధాలు చెబుతున్నారని ఆరోపిస్తూ, ప్రస్తుతం తమ ప్రభుత్వం ఆ తప్పులను సరిదిద్ది నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా రాయలసీమ అభివృద్ధిపై మాట్లాడిన సీఎం, ఒకప్పుడు కరవుతో అల్లాడిన ఈ ప్రాంతాన్ని ఉద్యాన

2 లో..



## ఇస్లామాబాద్‌లో షియా మసీదుపై బాంబు దాడి

- 15 మంది మృతి, 80 మందికి పైగా గాయాలు
- జుమ్మా ప్రార్థనల సమయంలో పేలుడు

మన గళం, ఇస్లామాబాద్ : పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ మరోసారి బాంబు పేలుడుతో దద్దరిల్లింది. శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో షియా మసీదును లక్ష్యంగా చేసుకుని జరిగిన భీకర దాడిలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని స్థానిక అధికారులు ధృవీకరించారు. ఇస్లామాబాద్

2 లో..

## విద్య ప్రాముఖ్యతపై దృష్టి ఆకర్షణ:రాష్ట్రపతి

- ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలని సూచన
- దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు
- కష్టపడి ముందుకు సాగాలని ప్రోత్సాహం



మన గళం, సిమ్లిపాల్, ఒడిశా : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశాలోని సిమ్లిపాల్ ప్రాంతంలో గిరిజన మహిళలు, యువతతో ప్రత్యేకంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారి జీవన పరిస్థితులు, విద్య, ఉపాధి అంశాలపై రాష్ట్రపతి చర్చించారు. రాష్ట్రపతి మాట్లాడుతూ విద్యే జీవితంలో మార్పుకు ప్రధాన సాధనమని స్పష్టం చేశారు. గిరిజన విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ

2 లో..

## హిందూ ధర్మ పరిరక్షణలో మౌనం వీడాలి

- ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది
- దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉండాలి
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు



మన గళం, డెస్క్ : ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను లేదా ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయం లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి సందర్భాల్లో మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుందని పేర్కొన్నారు. తన వ్యాఖ్యల్లో పవన్

2 లో..



## శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

- భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు

మన గళం, శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఈ రోజు సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యదర్శి, తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పా ట్లు పకడ్బందీగా

2 లో..

## బాలకృష్ణ ఇలాకాలో కాల్పుల కలకలం



- రౌడీషీటర్ నాగేంద్రపై పోలీసుల కాల్పులు
- కాలిలోకి దూసుకెళ్లిన బుల్లెట్ తీవ్ర గాయాలు



మన గళం, శ్రీ సత్యసాయి జిల్లా : శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. చిలమత్తూరు మండలం ఎర్రకొండ అటవీ ప్రాంతంలో రౌడీషీటర్ నాగేంద్రపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బుల్లెట్ నాగేంద్ర కాలిలోకి దూసుకెళ్లడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, నాగేంద్రను అరెస్ట్ చేసేందుకు సీఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ రవి అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఈ

2 లో..

## 2027 గోదావరి పుష్కరాలకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం



మన గళం, రాజమహేంద్రవరం : 2027 గోదావరి పుష్కరాల సన్నద్ధతపై తొలి ప్రాథమిక సమీక్షా సమావేశాన్ని రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నిర్వహించినట్లు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. 2027 జూన్ 26న ప్రారంభమై 12 రోజులపాటు కొనసాగనున్న గోదావరి పుష్కరాలను దేశానికి గర్వకారణంగా నిలిపేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యమే కేంద్రబిందువుగా కుంభమేళా తరహాలో అత్యున్నత ప్రమాణాలతో టెంట్ సిటీలు, హోమ్

2 లో..

## టీడీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



- హోంశాఖ మంత్రి అనిత

మన గళం, మంగళగిరి : మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆమె

2 లో..

# ఇస్లామాబాద్‌లో షియా మసీదుపై బాంబు దాడి



ఆగ్నేయ ప్రాంతమైన తర్లాయ్ కలాన్‌లోని ఖదీజతుల్ కుబ్రా మసీదులో ఈ పేలుడు చోటుచేసుకుంది. శుక్రవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రార్థనలకు హాజరైన సమయంలో పేలుడు సంభవించడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. నగరంలోని ప్రధాన ఆసుపత్రుల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ప్రాథమికంగా ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. మసీదు ప్రధాన ద్వారం వద్ద దుండగుడు తనను తాను పేల్చుకున్నట్లు కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. ఈ దాడిని పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండిస్తూ, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనకు ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గత ఏడాది నవంబర్‌లో ఇస్లామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించిన విషయం తెలిసిందే. తాజా ఘటన నేపథ్యంలో రాజధానిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# విద్య ప్రాముఖ్యతపై దృష్టి ఆకర్షణ : రాష్ట్రపతి



పథకాల లబ్ధిని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. విద్య ద్వారా మాత్రమే సమాజంలో గౌరవం, ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే మహిళలు, యువత కష్టపడి పనిచేస్తూ తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్రపతి హితవు పలికారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో గిరిజన సమాజం కూడా క్రియాశీల పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. సిమ్లిపాల్ ప్రాంత గిరిజనులలో ఉన్న ప్రతిభ, శ్రమ దేశానికి బలమని పేర్కొన్న రాష్ట్రపతి, ప్రభుత్వం వారి సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం గిరిజన సమాజంలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని అధికారులు తెలిపారు.

# బాలకృష్ణ ఇలాకాలో కాల్పుల కలకలం

సమయంలో నాగేంద్ర పోలీసులపై కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పరిస్థితి అదుపు తప్పడంతో ఆత్మరక్షణ నిమిత్తం సీఐ ఆంజనేయులు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. కాల్పుల్లో గాయపడిన నాగేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. నాగేంద్రపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కలిపి సుమారు 90 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో హిందూపురంలో జరిగిన అత్తాకోడళ్లపై గ్యాంగ్‌రేప్ కేసులో కూడా నాగేంద్ర ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. చాలా కాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న ఇతడిని పట్టుకునే క్రమంలోనే ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది.



# జగన్ పరామర్శ రాజకీయాలపై చంద్రబాబు సీరియస్






హబ్‌గా మారుస్తున్నామని చెప్పారు. ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు రాయలసీమ నుంచే వస్తున్నాయని, డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు.

పోలవరం ప్రాజెక్టుపై గత పాలకులపై విమర్శలు గుప్పించిన చంద్రబాబు, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇప్పుడు అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లు అందించి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టిని కూడా వివరించారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో గత పాలకులు డ్రామాలు చేశారని విమర్శించిన సీఎం, వెస్ట్ కర్నూలులో వేదవతి, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణలో మౌనం వీడాలి

కల్యాణ్ మాట్లాడుతూ, కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా మనం విభజనకు గురై ఉండవచ్చని, కానీ ధర్మం మాత్రం ఒక్కటేనని అన్నారు. దేవుళ్లు కూడా ఒకటేనని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా విశ్వాసాలను, ధర్మాన్ని అవమానించినప్పుడు తమ బాధను తెలియజేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అన్నారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడం అంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని ఆయన స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలు, సంప్రదాయాలను కాపాడుకోవడమే లక్ష్యమని వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మ గౌరవాన్ని కాపాడుకోగలమని పవన్ కల్యాణ్ తెలిపారు.

# 2027 గోదావరి పుష్కరాలకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం

స్టేలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లోని మండువా లోగిళ్లకు ప్రాధాన్యతనిస్తూ స్థానికులకు ఆర్థిక లాభాలు చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఒకే ఘాట్ వద్ద రద్దీ పెరగకుండా, గోదావరి పరివాహక ప్రాంతంలో ఎక్కడ స్నానం చేసినా పుణ్యఫలం సమానమే అనే అవగాహనను భక్తుల్లో కల్పించేందుకు ప్రముఖ ప్రవచనకర్తల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనివల్ల భక్తుల రాకపోకలు సమతుల్యంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రూ.97 కోట్ల వ్యయంతో చేపట్టిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా పుష్కర్ ఘాట్ అభివృద్ధి, హేవలాక్ వంతెన ఆధునికీకరణ, బ్రిడ్జిలంకలో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు, కడియంలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్, నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయ అభివృద్ధి, శెట్టిపేటలో బోట్ షికారు పనులు చేపడుతున్నామని వివరించారు. రోడ్ల కనెక్టివిటీ పెంపుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారీ ప్రాజెక్టులపై దృష్టి సారించినట్లు తెలిపారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ శాంతి భద్రతలు, పార్కింగ్, రవాణా, పరిశుభ్రత అంశాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు




ఇచ్చినట్లు మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. గోదావరి పుష్కరాలు 2027 భక్తి, సంస్కృతి, పర్యాటక సమ్మేళనంగా నిలవాలని, అందరి సహకారంతో ఈ మహా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలపై సమగ్ర సమీక్ష

చేయాలని ఆదేశించారు. దర్శన క్యూలైన్లు, త్రాగునీటి వసతి, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల నివారణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, శ్రీకాళహస్తి ఆలయం ఈవో, ఆలయ చైర్మన్, బోర్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్ణయించారు.

# టీడీపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలి





ఆరోపించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కలిసి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులతో మంత్రి అనిత ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గాల్లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా పార్లమెంట్ అధ్యక్షులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంలో పార్టీ నాయకులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. టీడీపీని క్షేత్రస్థాయిలో మరింత బలంగా నిలబెట్టేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అనిత పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు.

# ఘనంగా మంటి ఇంటర్నేషనల్లో స్కేటింగ్ పోటీలు





కర్నూల్ స్పోర్ట్స్,,మన గళం : బెంగళూరు హై వేయి లోని ఇందున్ నగర్ లో ఉన్న మాంటి ఇంటర్నేషనల్ స్కూల్ మైదానంలో శుక్రవారం ఉదయం స్కేటింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు, స్కూల్ అనువల్ స్పోర్ట్స్ మీ 2026 స్కేటింగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి కార్యక్రమానిక మంటిసోరి పాఠశాలల డైరెక్టర్ కె ఎన్ వి రాజశేఖర్ , ప్రముఖ కంటి వైద్య నిపుణులు స్కేటింగ్ సీనియర్ అధ్యక్షులు డాక్టర్ సుధాకర్ రావు, జిల్లా స్కేటింగ్ సంఘం అధ్యక్షులు ఎస్ సుధాకర్ బాబు, జిల్లా ఒలంపిక్ సంఘం సీఈవో పి విజయ్ కుమార్, పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో మాంటి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు స్కేటింగ్ విన్యాసాలు ప్రదర్శించారు అతిథులు జండా ఊపి స్కేటింగ్ పోటీలను ప్రారంభించారు పోటీలు ఘనంగా నిర్వహించారు గెలుపొందిన విద్యార్థి విద్యార్థినులకు యాజమాన్యం అతిథులు మెడల్స్ వేసి సత్కరించారు చిన్నారులు చేసిన స్కేటింగ్ విన్యాసాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి, కార్యక్రమంలో డాక్టర్ సావిత్రి సుధాకర్, డాక్టర్ రాం బాలాజీ నాయక్ స్కేటింగ్ సంఘం సభ్యులు సుధీర్ జిల్లా స్కేటింగ్ సంఘం కార్యదర్శి అబుబాకర్, సీఈవో పి సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు విద్యార్థి చేసిన లింబో స్కేటింగ్ చూపర్లకు కనువిందు చేశాయి కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ క్రిస్టి ఇమ్మానియేల్ కోఆర్డినేటర్లు తబస్సుమ ఒలీవియా, హారిక, పాల్గొన్నారు

# నా బర్డ్ నిధులతో రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోట్ల





మన గళంప్యాపిలి మండలంలోని కలచట్ల గ్రామంలో కలచట్ల బయో రిసోర్స్ సెంటర్తో పాటు సేంద్రియ కూరగాయల బండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మరియు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజ కుమారి గనియా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరియు జిల్లా కలెక్టర్ బయో రిసోర్స్ సెంటర్ను ప్రారంభించి, సేంద్రియ వ్యవసాయ విధానాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కేంద్రం ద్వారా రైతులు సేంద్రియ ఎరువులు, జీవాణు ఆధారిత ఇన్పుట్లు పొందడంతో పాటు, వ్యవసాయ వ్యయాలు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. అలాగే రైతులు పండించిన సేంద్రియ కూరగాయలను నేరుగా వినియోగదారులకు చేరవేయడానికి ఏర్పాటు చేసిన కూరగాయల బండ్లను ప్రారంభించారు.

అనంతరం ప్రభుత్వ సబ్సిడీతో అందిస్తున్న ట్రాక్టర్లను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు యాంత్రీకరణ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి వ్యవసాయ పనులు సులభతరం అవుతాయని అన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయ రంగాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని వారు స్పష్టం చేశారు.



# భ్రమరాంబికా సేవా సమితి, చీరాల వారు అన్నప్రసాద వితరణ విభాగానికి లక్ష విస్తరాకులను విరాళం

మనగళం శ్రీశైలం : ఫిబ్రవరి 8 నుండి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.ఈ సందర్భముగా ఈ రోజు ( 06.02.2026 ) శ్రీ భ్రమరాంబికా సేవా సమితి, చీరాల వారు అన్నప్రసాద వితరణ విభాగానికి లక్ష విస్తరాకులను విరాళంగా అందజేశారు.వీరు అన్నపూర్ణాభవనం నందు సహాయ కార్యనిర్వహణాధికారి, పర్యవేక్షకుల వీటిని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ విస్తరాకులను సమర్పించడం జరిగిందన్నారు. వీటి విలువ రూ. 3,00,000/-లకు పైగా ఉంటుందని దాతలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో వీరు విస్తరాకులను అందజేయడం జరుగుతోంది. ఈ కార్యక్రమములో భ్రమరాంబికా సేవా సమితి అధ్యక్షురాలు శ్రీమతి యం.వి. మహాలక్ష్మీ, పలువురు



సేవా సమితి ప్రతినిధులు శివ సేవకులు పాల్గొన్నారు.

# అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (06.02.2026) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది.ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది.కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన దమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

# శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవ





మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (06.02.2026 ) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

# రాయలసీమ ద్రోహి జగన్.. అభివృద్ధి చేసింది ఒక్క టీడీపీనే : మంత్రుల ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి

మనగళం, నంద్యాల గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి, ఇప్పుడు కేవలం రాజకీయ ఉనికి కోసం, తిరుమల లడ్డు కల్తీ పాపాన్ని పక్కదారి పట్టించడానికే వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బి.సి. జనార్ధన్ రెడ్డి మరియు నంద్యాల తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.సీమ ప్రాజెక్టుల పితామహుడు ఎన్టీఆర్ అని రాయలసీమ కరువు తీర్చడానికి తెలుగు గంగ, ఎస్ఆర్.బిసి వంటి భారీ ప్రాజెక్టులను ప్రారంభించిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్దేనని గుర్తు చేశారు. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు హయాంలో రూ. 12,000 కోట్లు ఖర్చు చేసి జిల్లాలోని అన్ని చెరువులకు నీరు అందించామని, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా 13 పంపులను ప్రారంభించి రైతులకు అండగా నిలిచామని తెలిపారు.అనుమతులు లేని ప్రాజెక్టులతో దోపిడీ

"రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ఎటువంటి అనుమతులు లేకుండా ప్రారంభించి, కేవలం మట్టి పనుల పేరుతో జగన్ తన అనుచరుల జేబులు నింపుకున్నారని. అనుమతులు లేనందున ఎన్.జిటీ జరిమానా వేసినా, అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ స్టేను తొలగించే ప్రయత్నం ఎందుకు చేయలేదు?" అని నిలదీశారు. అన్నమయ్య ప్రాజెక్టు వైఫల్యం జగన్ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని అన్నారు. తుంగభద్ర గేట్లు కొట్టుకుపోయినప్పుడు కేవలం 5 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన రిపేర్ చేయించి రబీ పంటలను కాపాడిన ఘనత చంద్రబాబుదని . వైసీపీ ఐదేళ్లలో కేవలం రూ. 2,000 కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే రూ. 8,000 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. 'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వేల ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టులు, పరిశ్రమలు తీసుకొస్తున్నామని వెల్లడించారు. జగన్ నిజంగా రాయలసీమ బిడ్డ అయితే, అసెంబ్లీకి వచ్చి సీమ అభివృద్ధిపై చర్చకు రావాలని మంత్రులు సవాల్ విసిరారు. లడ్డు వివాదం నుండి తప్పించుకోవడానికే 'చలో పోతిరెడ్డిపాడు'తిరుమల లడ్డు అపవిత్రతపై ప్రజల్లో వస్తున్న ఆగ్రహాన్ని తట్టుకోలేక, దాన్ని పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఇప్పుడు 'చలో పోతిరెడ్డిపాడు' వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రులు ఎద్దేవా చేశారు. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన సొంత ఊరిలో కట్టిన షాదీఖానాకే నిధులు తెచ్చుకోలేకపోయారని మంత్రి ఫరూక్ విమర్శించారు. అభివృద్ధిపై చర్చించే అర్హత వైసీపీ నేతలకు లేదని, రాబోయే రోజుల్లో ఆ పార్టీకి మనుగడ ఉండదని వారు స్పష్టం చేశారు.



## సైబర్ మోసానికి గురయ్యారా..? డబ్బులు పోయాయా..?




హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026,మన గళం : డిజిటల్ చెల్లింపులు ఎంత సౌకర్యవంతంగా ఉన్నాయో.. అంతే స్థాయిలో సైబర్ మోసాల ప్రమాదం కూడా పెరుగుతోంది. ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు బ్యాంకు అధికారులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులుగా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. కేవైసీ అప్‌డేట్, ఖాతా బ్లాక్ అవుతుందన్న బెదిరింపులు, లింకుల ద్వారా ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు లాగేసుకుని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బును ఖాళీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ మోసాల బాధితులకు ఉపశమనం కల్పించే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రతిపాదన చేసింది. ఫిబ్రవరిలో జరిగిన ద్రవ్య పరపతి విధాన సమావేశంలో చిన్న మొత్తాల సైబర్ మోసాల కేసుల్లో బాధితులకు రూ.25 వేల వరకు నష్టపరిహారం చెల్లించే విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆర్‌బీఐ సూచించింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశంగా పేర్కొంది. గత కొన్నేళ్లుగా డిజిటల్ మోసాల కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న సీనియర్ సిటిజన్ల జీవిత పొదుపు క్షణాల్లోనే కొల్లగొట్టబడుతున్న ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. కొందరు మోసానికి గురై తీవ్ర మానసిక వేదనకు లోనై ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చిన్న-విలువ సైబర్ మోసాలపై నష్టపరిహారం ఇవ్వాలన్న ఆర్‌బీఐ ప్రతిపాదన బాధితులకు తక్షణ ఉపశమనం కలిగించే అవకాశముంది. అలాగే బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలు వినియోగదారులకు మరింత భద్రత కల్పించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలు చేసే వారు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ తెలియజేయవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## విమానంలో బాలున్ని ఎక్కనివ్వలేదు.. చివరికి ఎయిర్‌లైన్స్‌కే షాక్..!

హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026 ,మన గళం : కేరళలోని ఎర్నాకుళం జిల్లా వినియోగదారుల కమిషన్ ఒక విమానయాన సంస్థపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ భారీ జరిమానా విధించింది. 2013లో కొచ్చి నుంచి దోహాకు ప్రయాణించాల్సిన ఓ కుటుంబాన్ని, మైనర్ బాలుడికి బోర్డింగ్ పాస్ ఇవ్వకుండా అడ్డుకోవడం ద్వారా ఎయిర్‌లైన్స్ తీవ్ర నిర్లక్ష్యం చూపిందని కమిషన్ తేల్చింది. ఆ రోజు ప్రయాణికుడు జోసెఫ్ తన భార్య, పిల్లలతో కలిసి సమయానికి విమానాశ్రయానికి చేరుకున్నాడు. అయితే బాలుడి వీసా పాత పాస్‌పోర్ట్‌పై ఉండటాన్ని కారణంగా చూపుతూ సిబ్బంది అతడిని విమానంలోకి అనుమతించలేదు. తండ్రి పాత, కొత్త పాస్‌పోర్ట్‌లు రెండింటినీ సమర్పించినప్పటికీ ఎయిర్‌లైన్ సిబ్బంది వినిపించుకోలేదు. దీంతో కుటుంబం మొత్తం ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. మరుసటి రోజు అదే పాస్‌పోర్ట్, అదే వీసాతో మరో విమానయాన సంస్థ ఎలాంటి అభ్యంతరం లేకుండా బాలుడికి బోర్డింగ్ పాస్ జారీ చేసింది. దీంతో తొలి ఎయిర్‌లైన్ చేసిన నిరాకరణ పూర్తిగా తప్పేనని రుజువైంది. తన తప్పును అంగీకరించాల్సిన బదులు ఎయిర్‌లైన్ కల్పిత సర్క్యులర్‌ను కోర్టులో చూపిందని కమిషన్ గుర్తించింది. అంతర్జాతీయ ప్రయాణాలకు సంబంధించిన ఇమ్మిగ్రేషన్ నిబంధనలు అన్ని విమానయాన సంస్థలకు ఒకటేనని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై విమానయాన సిబ్బంది ప్రవర్తన వేధింపుల మాదిరిగా ఉందని కమిషన్ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ నిర్లక్ష్యం వల్ల కుటుంబానికి మానసిక



క్షోభతో పాటు ఆర్థిక నష్టం వాటిల్లిందని పేర్కొంది. దాదాపు పన్నెండు సంవత్సరాల న్యాయపోరాటం అనంతరం బాధిత కుటుంబానికి అనుకూలంగా తీర్పు వెలువడింది. ఎయిర్‌లైన్ టికెట్ డబ్బును వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని, అదనంగా మానసిక వేదనకు పరిహారం, న్యాయ ఖర్చులు కలిపి మొత్తం సుమారు ఒక లక్ష ఇరవై ఐదు వేల రూపాయలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. ఈ మొత్తాన్ని ముప్పై రోజుల్లోపు చెల్లించకపోతే అదనపు వడ్డీ విధిస్తామని హెచ్చరించింది

## లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. ఇన్వెస్టర్లలో కొత్త ఉత్సాహం..!

ముంబై 06 ఫిబ్రవరి 2026 ,మన గళం : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడం దేశీయ స్టాక్ మార్కెట్లకు సానుకూల సంకేతంగా మారింది. ఆర్థిక స్థిరత్వానికి ప్రాధాన్యం ఇస్తామని ఆర్బీఐ స్పష్టం చేయడంతో ఇన్వెస్టర్లలో నమ్మకం పెరిగింది. ముఖ్యంగా రాబోయే ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాలు ఆశాజనకంగా ఉండటంతో మార్కెట్ సెంటిమెంట్‌కు బలం చేకూరింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 266 పాయింట్లు లాభపడి 83,580 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 50 పాయింట్లు పెరిగి 25,693 స్థాయిలో ముగిసింది. అయితే బ్రాడర్ మార్కెట్లలో మిశ్రమ ధోరణి కనిపించింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో స్వల్ప అమ్మకాల ఒత్తిడి ఉండటంతో చిన్న స్టాక్స్‌లో మదుపర్లు కొంత జాగ్రత్తగా వ్యవహరించారు. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ రంగం ప్రధానంగా మార్కెట్‌ను ముందుకు నడిపించింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ప్రైవేట్ బ్యాంకింగ్, రియల్టీ



రంగాల్లోనూ కొనుగోళ్లు కనిపించాయి. మరోవైపు ఐటీ, ఫార్మా రంగాల్లో మాత్రం అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ సూచీ 25,400 పాయింట్లకు పైన నిలబడుతున్నంత వరకు మార్కెట్ సానుకూల ధోరణిలోనే కదలాడుతుందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రేపు దేశవ్యాప్తంగా క్యాబ్, బైక్ టాక్సీల సమ్మె.. ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు..!

హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026 ,మన గళం : దేశవ్యాప్తంగా ఓలా, ఉబర్, ర్యాపిడో, పోర్టర్ వంటి యాప్ ఆధారిత రవాణా సేవల డ్రైవర్లు శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమ్మెకు పిలుపునిచ్చారు. అగ్రిగేటర్ సంస్థల ఏకపక్ష విధానాల వల్ల తమ ఆదాయం తీవ్రంగా పడిపోతోందని డ్రైవర్ల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో ఈ సమ్మె ప్రభావం ఎక్కువగా ఉండనుందని అంచనా వేస్తున్నారు. డ్రైవర్ల ఆరోపణల ప్రకారం ప్రస్తుతం అమలులో ఉన్న కనీస ధర విధానం వల్ల ప్రయాణానికి వచ్చే మొత్తంలో డ్రైవర్లకు మిగిలే ఆదాయం గణనీయంగా తగ్గుతోంది. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల నిర్వహణ ఖర్చులతో పోలిస్తే యాప్ కంపెనీలు చెల్లిస్తున్న రేట్లు ఏమాత్రం సరిపోవడం లేదని వారు వాపోతున్నారు. పైగా అగ్రిగేటర్ సంస్థలు అధిక కమిషన్లు వసూలు చేస్తూ డ్రైవర్లను ఆర్థికంగా నష్టపరుస్తున్నాయని ఆరోపిస్తున్నారు.

ఈ సమస్యలపై కేవలం కంపెనీలే కాదు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తక్షణమే జోక్యం చేసుకోవాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించాలని, ధరల నిర్ణయంలో పారదర్శకత తీసుకురావాలని కోరుతున్నారు. తమ డిమాండ్లు




పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో నిరసనలు మరింత ఉధృతం చేస్తామని డ్రైవర్ల సంఘాల నేతలు హెచ్చరించారు

## కారు కొనుగోలుదారులకు షాక్..




హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026 ,మన గళం :దేశీయ ఆటోమొబైల్ మార్కెట్‌లో మరోసారి ధరల పెంపు వార్త వినియోగదారులను నిరాశకు గురిచేసింది. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ తమ వాహనాల ధరలను గరిష్టంగా 1.98 శాతం వరకు పెంచుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ముడి సరుకుల ధరలు పెరగడం, ఉత్పత్తి ఖర్చులు అధికమవడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. టయోటా పోర్ట్‌ఫోలియోలో ఉన్న గ్లాంజా, రూమియన్, అర్బన్ క్రూయిజర్ టైజర్, హైరైడర్, ఇన్నోవా హైక్రాస్, ఇన్నోవా క్రిస్టా, ఫార్చ్యూనర్, హైలక్స్, ల్యాండ్ క్రూయిజర్ 300, క్యామ్రీ, వెల్‌ఫైర్ వంటి అన్ని మోడళ్ల ధరలు ఈ పెంపు పరిధిలోకి వస్తాయి. ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వినియోగదారులపై కూడా తాజా ధరల పెంపు ప్రభావం పడనుందని కంపెనీ స్పష్టం చేసింది. కొత్తగా వాహనం కొనాలనుకునే వారు తాజా ధరల వివరాల కోసం డీలర్‌షిప్‌లను సంప్రదించాలని సూచించింది. ఇన్‌పుట్ ఖర్చులు పెరగడంతో ఆటోమొబైల్ రంగంలో ధరల పెంపు ధోరణి కొనసాగుతోంది. ఈ ఏడాది టయోటాతో పాటు టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, హ్యుందాయ్, మహీంద్రా, ఆడి, బిఎమ్డబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, వోక్స్వాగన్, స్కోడా వంటి పలువురు తయారీదారులు తమ వాహనాల ధరలను పెంచిన సంగతి తెలిసిందే. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, అంతర్జాతీయ మార్కెట్లలో ముడి సరుకుల ధరల మార్పులు దేశీయ ఆటో మార్కెట్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి.

## క్రిప్టో మార్కెట్‌లో కలకలం.. బిట్‌కాయిన్ భారీగా పతనం..

హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026 ,మన గళం :ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీగా పేరున్న బిట్‌కాయిన్ విలువ శుక్రవారం ఒక్కసారిగా భారీగా పడిపోయింది. ఒకే రోజులో సుమారు 12 శాతం క్షీణించి 65000 డాలర్ల దిగువకు చేరింది. గత ఏడాది కాలంలో ఇదే అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ స్థాయిలో బిట్‌కాయిన్ పడిపోవడం ఇదే తొలిసారి అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

క్రిప్టో మార్కెట్‌లో భయాందోళన వాతావరణం నెలకొనడంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా అమ్మకాల వైపు మొగ్గు చూపారు. దీంతో బిట్‌కాయిన్ ధర 64352 డాలర్ల స్థాయికి చేరింది. ఏడాది వ్యవధిలో చూస్తే బిట్‌కాయిన్ విలువ దాదాపు 33 శాతం వరకు తగ్గింది. గడిచిన 24 గంటల్లోనే దాదాపు 1 బిలియన్ డాలర్ల విలువైన బిట్‌కాయిన్ మార్కెట్ నుంచి బయటకు వెళ్లినట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ నెలలో బిట్‌కాయిన్ ధర చరిత్రలోనే అత్యధికంగా 126000 డాలర్లను తాకింది. అక్కడి నుంచి చూస్తే ప్రస్తుతం ధర దాదాపు సగానికి పడిపోయినట్టే. ప్రస్తుతం బిట్‌కాయిన్ మొత్తం మార్కెట్ విలువ సుమారు 1.28 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. గడిచిన 24 గంటల్లో మొత్తం క్రిప్టో మార్కెట్ విలువ కూడా గణనీయంగా తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. బిట్‌కాయిన్ ప్రభావంతో ఇతర క్రిప్టో కరెన్సీలూ నష్టాల్లోనే ట్రేడవుతున్నాయి. టెథర్ ధర దాదాపు స్థిరంగా ఉండగా, బైనాన్స్ కాయిన్, ఎక్స్ఆర్‌పి, సోలానా, డాగ్‌కాయిన్ వంటి కాయిన్లు కూడా



గణనీయంగా పడిపోయాయి. ముఖ్యంగా చిన్న కాయిన్లలో భారీగా అమ్మకాలు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. క్రిప్టో మార్కెట్‌లో ఇటీవలి కాలంలో భారీ ఊగిసలాటలు కొనసాగుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. కీలక సపోర్ట్ స్థాయిల వద్ద మార్కెట్ ఎలా స్పందిస్తుందో గమనిస్తూ పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకోవాలని, ఒక్కసారిగా భావోద్వేగాలకు లోనై ట్రేడింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## సంపాదన పెరిగినా సంతోషం ఎందుకు తగ్గుతోంది?

ఒకప్పుడు నెల జీతం పెరిగితే ఆనందం పెరిగేది. నేడు ఆదాయం పెరుగుతున్నా, మనసులో సంతృప్తి తగ్గుతున్నట్లు అనిపిస్తోంది. పెద్ద ఇళ్లు, ఖరీదైన వాహనాలు, చేతిలో ఆధునిక సౌకర్యాలు ఉన్నప్పటికీ, మనసు మాత్రం ప్రశాంతంగా ఉండటం లేదు. సంపాదన పెరుగుదలతో పాటు సంతోషం కూడా పెరగాలి అన్న సహజ భావన ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ విరుద్ధ పరిస్థితి వెనుక ఉన్న కారణాలను సమాజం లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు మన జీవితాలు మరింత వేగంగా మారాయి. ఉద్యోగ ఒత్తిళ్లు పెరిగాయి. పోటీ తీవ్రమైంది. ఎక్కువ సంపాదించాలనే తాపత్రయం మనిషిని నిరంతర పరుగులోకి నెట్టేస్తోంది. ఈ పరుగులో కుటుంబానికి సమయం లేదు, స్నేహానికి చోటు లేదు, తనకు తాను ప్రశ్నించుకునే క్షణాలు లేవు. ఫలితంగా సంపాదన ఉన్నా, మనసు ఖాళీగా మారుతోంది.

సంతోషాన్ని మనం క్రమంగా వస్తువులతో కొలవడం మొదలుపెట్టాం. ఎంత సంపాదిస్తే అంత సంతోషం అన్న భావన మన ఆలోచనల్లో బలంగా నాటుకుపోయింది. కానీ ఈ ఆలోచనే మన అసంతృప్తికి మూలం అవుతోంది. ఎందుకంటే మనకంటే ఎక్కువ ఉన్నవారితో పోల్చుకోవడం, ఎప్పుడూ ఇంకేదో కావాలన్న భావనను పెంచుతోంది. ఈ తులనాత్మక జీవితం మనకు ఉన్నదాన్ని ఆస్వాదించనివ్వకుండా చేస్తోంది. సంపాదన పెరిగేకొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతున్నాయి. అప్పులు, ఖర్చులు, భవిష్యత్తుపై భయాలు మనసును వెంటాడుతున్నాయి. ఒక స్థాయికి చేరుకున్నాక విశ్రాంతి దొరుకుతుందన్న ఆశ, ఆ స్థాయి చేరిన తర్వాత కూడా నెరవేరడం లేదు. ఎందుకంటే ఆశలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ అంతులేని ఆశలే సంతోషానికి అడ్డుగోడగా మారుతున్నాయి.

కుటుంబ బంధాల విషయంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సంపాదన కోసం ఎక్కువ సమయం పనికి కేటాయించడంతో, కుటుంబంతో గడిపే సమయం తగ్గిపోతోంది. ఒకే ఇంట్లో ఉన్నా, ప్రతి ఒక్కరూ తమ తమ ప్రపంచాల్లో మునిగిపోతున్నారు. మాటలు తగ్గుతున్నాయి, అనుబంధాలు పల్చబడుతున్నాయి. సంపాదన పెరిగినా, ఆ సంపాదనతో పంచుకునే ఆనందం మాత్రం తగ్గిపోతోంది.

సామాజిక జీవితం కూడా మారిపోయింది. ఒకప్పుడు స్నేహితులతో కలిసి గడిపే సమయం మనసుకు ఉత్సాహాన్ని ఇచ్చేది. ఇప్పుడు ఆ స్థానాన్ని ఒంటరితనం తీసుకుంటోంది. సంపాదన పెరిగినా, మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. భావాలను పంచుకునే వేదికలు తగ్గిపోవడంతో, మనసులోని భారాన్ని మోసుకుంటూనే జీవించాల్సి వస్తోంది. సంతోషం అనేది కేవలం సంపాదనతో వచ్చే విషయం కాదన్న సత్యాన్ని సమాజం మరిచిపోతోంది. ఆరోగ్యం, ప్రశాంతత, బలమైన సంబంధాలు, ఆత్మసంతృప్తి  ఇవన్నీ కలిసినప్పుడే నిజమైన సంతోషం లభిస్తుంది. కానీ మనం ఈ అంశాలను పక్కనపెట్టి, కేవలం ఆదాయంపైనే దృష్టి పెట్టడం వల్ల జీవితం అసమతుల్యంగా మారుతోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే మన ఆలోచనల్లో మార్పు రావాలి. ఎంత సంపాదిస్తున్నామన్నదికంటే, ఎలా జీవిస్తున్నామన్నదే ముఖ్యమని గుర్తించాలి. మనకు ఉన్నదానిపై కృతజ్ఞత భావం పెంచుకోవాలి. కుటుంబానికి, స్నేహాలకు, మనసుకు సమయం కేటాయించాలి. అప్పుడే సంపాదనతో పాటు సంతోషం కూడా మన జీవితంలో స్థిరపడుతుంది.

మొత్తంగా సంపాదన పెరుగుతుండటం అభివృద్ధికి సంకేతమే. కానీ అదే అభివృద్ధి మనసుకు ఆనందం ఇవ్వకపోతే, ఆ అభివృద్ధి అసంపూర్ణమే. నిజమైన సంపద డబ్బులో కాదు, మనసు ప్రశాంతతలో ఉందన్న సత్యాన్ని సమాజం అర్థం చేసుకున్న రోజే, సంపాదనతో పాటు సంతోషం కూడా పెరుగుతుంది.

## తిక్క స్వామి ఉరుసులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే శిల్ప రవి

మనగళం, నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్ లో వెలసిన తిక్క స్వామి దర్గా ఉరుసు మహోత్సవంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి  స్వామి వారి దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గత 75 సంవత్సరాలుగా నంద్యాల పట్టణంలో కుల మతాలకతీతంగా నంద్యాల మరియు చుట్టుపక్కల ప్రాంతంలో వారు విశేషంగా తిక్క స్వామి వారి దర్గాను దర్శించుకుని ఉరుసు మహోత్సవంలో వేలాదిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కౌన్సిలర్ కృష్ణమోహన్ , 24 వ వార్డు ఇన్చార్జి రహంతుల్లా,  మేధావుల సంఘం అధ్యక్షుడు రసూలు ఆజాద్, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, జలిల్, మా బాషా,శ్రీను, అడ్వకేట్ పునీత్ కుమార్, కరీం ఖాన్, నవ్యాంధ్ర రాష్ట్ర వైసీపీ అధ్యక్షుడు కబీర్, సుబ్బమ్మ మరియు వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు



## శ్రీశైల మల్లిఖార్జున స్వామి వారి హుండీల లెక్కింపు


మనగళం శ్రీశైలం : ఈ రోజు (06.02.2026 ) జరిగిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 3,76,22,452/- నగదు రాబడిగా లభించింది. కాగా ఈ హుండీల రాబడిని భక్తులు గత 25 రోజులలో ( 12.01.2026 నుండి 05.02.2026 వరకు) సమర్పించడం జరిగింది. ఇందులో ఉభయ దేవాలయాల హుండీల ద్వారా 3,73,32,470/-లు మరియు అన్న ప్రసాదవితరణ హుండీల ద్వారా రూ. 2,89,982లు లభించాయి. కాగా అప్రైజర్ హాజరు కాని కారణంగా బంగారు, వెండి లెక్కించబడలేదు. అదేవిధంగా 526 యుఎస్ఏ డాలర్లు, 84 సింగపూర్ డాలర్లు, 140 కెనడా డాలర్లు, 10 - ఆస్ట్రేలియా డాలర్లు, 10 ఈరోస్, 55 - ఇంగ్లాండు ఫౌండ్స్, 28 - మలేషియా రింగిట్స్, 10 - సౌదీరియాల్స్, 800 - ఓమన్ బైసా, 1435 యు.ఎ.ఇ దిర్హామ్స్ ఈ హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపులో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్.రమణమ్మ, పలువిభాగాల యూనిట్



అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేత మృతి పట్ల ఎమ్మెల్యే  ప్రగాఢ సంతాపం

మన గళం కర్నూలు: కోడుమూరు నియోజకవర్గం లోని ఈ తాండ్రపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ సత్యం యాదవ్ అనారోగ్యంతో మరణించారు. కోడుమూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మృతుని నివాసానికి వెళ్లి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. టిడిపికి ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. మృతిని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## మధ్యాహ్న భోజనం మెనూ సక్రమంగా అమలు చేయాలి

మన గళం బనగానపల్లె: బందెల ఓబులేసు రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డిమాండ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లె లో జిల్లా పరిషత్ హై స్కూల్ లో మధ్యాహ్న భోజనం ను పరిశీలించి అనంతరం విద్యార్థుల తో భోజనం గురించి మాట్లాడి తెలుసుకున్నారు

మెనూ ప్రకారం భోజనం విద్యార్థుల కు అందజేయాలనీ అంతేకాకుండా వారం లో ఎన్ని రోజులు గుడ్డు ఇవ్వాలో అన్ని రోజులు విద్యార్థులు కు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు భోజనం లో నాణ్యత పాటించాలని పరిశుభ్రమైన కూరగాయలు మరియు ముడి సరుకులు వాటికీ సంభందించిన నిత్యావసరం సరుకులు ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ విద్యార్థుల కు సరైన మెనూ ప్రకారం వడ్డించాలని ఆయన నిర్వాహకులకు తెలియజేసారు అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు కూడా అక్కడే విద్యార్థుల తో పాటు మధ్యాహ్నాం భోజనం తింటే సమస్యలు వారికీ తెలుస్తాయని దాని వల్ల సమస్యలు గుర్తించవచ్చని ఆయన అన్నారు




అంతేకాకుండా మధ్యాహ్నభోజనం బిల్లులు కూడా త్వరగా విడుదల చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలో మురుగు పట్టిన నిర్లక్ష్యం

**- రోడ్డుపై పారుతున్న మురుగునీరు**

మన గళం ,కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలలోని వెంకటగిరి గ్రామంలో కోడుమూరు బి వెల్దుర్తి ప్రధాన రహదారిపై బస్టాండ్ వద్ద మురుగునీరు రోడ్డుపై పొంగి పొర్లుతోంది. గత మూడు నెలల క్రితం గ్రామంలో కొత్తగా సి.సి రహదారి ని నిర్మించారు. సీసీ రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ బస్టాండ్ సమీపంలో నూతన కల్వర్టును ఏర్పాటు చేయలేదు. దీంతో కల్వర్టులో నుంచి మురుగునీరు ముందుకు సాగడం లేదు. పాత కల్వర్టులో ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్త పేరుకుపోయి మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేక కాలువల పైనుంచి మురుగునీరు పొంగి ప్రధాన రహదారిపైనే నిలిచిపోతోంది. ఆర్ అండ్ బి అధికారులు లక్షల నిధులు ఖర్చు చేసి సి.సి రోడ్డు ని నిర్మించారే గాని కల్వర్టు ఏర్పాటు చేయకపోవడంతో మురుగునీరు ప్రధాన రహదారిపైనే నిలిచిపోతోంది. దీంతో విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనలకు గురి అవుతున్నారు. అధికారులు తమ సమస్యను ఉన్నతాధికారులు పరిష్కరించాలని వెంకటగిరి ప్రజలు వాపోతున్నారు.



# నిమ్మరసం.. శరీరానికి తాజాదనం ఇచ్చే సహజ పానీయం



డెస్క్, ఫిబ్రవరి 6 మన గళం: వేసవిలోనే కాదుఌ ఏడాది పొడవునా ఉపయోగం నిమ్మరసం అంటే చాలామందికి ముందుగా వేసవే గుర్తుకు వస్తుంది. కానీ నిమ్మరసం కేవలం దాహం తీర్చే పానీయం మాత్రమే కాదని, ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేసే సహజ పానీయమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో సులభంగా తయారుచేసుకోగలిగే నిమ్మరసం తక్కువ ఖర్చుతో శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుందని వారు పేర్కొంటున్నారు. రోజువారీ జీవనశైలిలో నిమ్మరసాన్ని భాగం చేసుకుంటే శరీరం చురుకుగా ఉంటుందని సూచిస్తున్నారు.

– విటమిన్‌సి తో రోగనిరోధక శక్తి పెంపు

నిమ్మలో విటమిన్‌సి సమృద్ధిగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తరచూ జలుబు, దగ్గు వచ్చే వారికి నిమ్మరసం మేలు చేస్తుందని సూచిస్తున్నారు. శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను ఎదుర్కొనే యాంటీఆక్సిడెంట్ గుణాలు నిమ్మరసంలో ఉన్నాయని, ఇవి శరీరాన్ని లోపలి నుంచి రక్షిస్తాయని నిపుణుల అభిప్రాయం.

– జీర్ణక్రియ, బరువు నియంత్రణకు సహాయం

నిమ్మరసం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు. పరికడుపుతో గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగితే పేగులు శుభ్రపడతాయని, మలబద్ధకం సమస్య తగ్గుతుందని సూచిస్తున్నారు. అలాగే నిమ్మరసం ఆకలిని నియంత్రించి అతిగా తినకుండా చేయడంలో తోడ్పడుతుందని, అందుకే బరువు నియంత్రణలో ఉన్నవారికి ఇది ఉపయోగకరమని నిపుణులు పేర్కొంటున్నారు.

– సరైన మోతాదు, జాగ్రత్తలు అవసరం

నిమ్మరసం ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, అతిగా తాగడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఎసిడిటీ, పళ్ల ఎనామెల్ దెబ్బతినే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉప్పు, చక్కెర ఎక్కువగా కలపకుండా, సహజంగా లేదా తేనె కొద్దిగా కలిపి తాగడం మంచిదని సూచిస్తున్నారు. ఎసిడిటీ సమస్య ఉన్నవారు పరిమితంగా మాత్రమే నిమ్మరసం తీసుకోవాలని సూచిస్తూ, సరైన మోతాదులో నిమ్మరసాన్ని రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి తాజాదనం, ఆరోగ్యం రెండూ లభిస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వేప పుల్ల.. దంత ఆరోగ్యానికి ప్రకృతి ఇచ్చిన ఔషధం



డెస్క్, ఫిబ్రవరి 6, మన గళం: తరం తరాలుగా కొనసాగుతున్న సహజ దంత సంరక్షణ వేప పుల్లతో పళ్లు తోముకోవడం భారతీయ సంప్రదాయంలో అనాదిగా కొనసాగుతున్న అలవాటు. టూత్‌పేస్ట్‌లు లేని కాలంలోనే కాకుండా, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో వేప పుల్లను దంత సంరక్షణకు ఉపయోగిస్తున్నారు. ఉదయం పరికడుపుతో వేప పుల్ల నమలడం నోటి శుభ్రతను కాపాడటంతో పాటు ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ప్రకృతిలోనే లభించే ఈ సాధనం తక్కువ ఖర్చుతో అందరికీ ఉపయోగపడే సంపదగా నిలుస్తోంది.

– బాక్టీరియా నివారణలో వేప గుణాలు

వేపలో సహజ యాంటీబాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వేప పుల్లతో పళ్లు తోముకోవడం వల్ల నోటిలోని హానికరమైన బ్యాక్టీరియా తగ్గి దంత క్షయం, పళ్ల పురుగు, దుర్వాసన వంటి సమస్యలు తగ్గుతాయని చెబుతున్నారు. చిగుళ్ల వాపు, రక్తస్రావం వంటి సమస్యల నివారణలో కూడా వేప పుల్ల ఉపకరిస్తుందని ఆయుర్వేదంలో ప్రస్తావన ఉందని పేర్కొంటున్నారు.

– చిగుళ్లు బలపడటానికి సహాయం

వేప పుల్లను నమలడం వల్ల చిగుళ్లకు సహజ మసాజ్ లభిస్తుందని దంత వైద్యులు చెబుతున్నారు. దీని వల్ల రక్తప్రసరణ మెరుగుపడి చిగుళ్లు బలపడతాయని, పళ్లు ఊగిపోవడం వంటి సమస్యలు తగ్గుతాయని సూచిస్తున్నారు. రసాయనాలు కలిగిన టూత్‌పేస్ట్‌లతో పోలిస్తే వేప పుల్ల పూర్తిగా సహజమైనదని, దీర్ఘకాల వినియోగంలో దంతాలకు హాని తక్కువగా ఉంటుందని నిపుణుల అభిప్రాయం.

– వినియోగంలో జాగ్రత్తలు అవసరం

వేప పుల్ల ఉపయోగకరమైనదైనా, సరైన విధానంలో వినియోగించాల్సిన అవసరం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పుల్లను ఎక్కువగా నమలడం వల్ల చిగుళ్లకు గాయాలు కావచ్చని, రోజుకు ఒక్కసారి మాత్రమే ఉపయోగించడం మంచిదని సూచిస్తున్నారు. అలాగే శుభ్రమైన, తాజా వేప పుల్లను మాత్రమే వినియోగించాలని చెబుతున్నారు. ఆధునిక దంత సంరక్షణతో పాటు వేప పుల్లను పరిమితంగా అలవాటు చేసుకుంటే దంత ఆరోగ్యం మెరుగ్గా ఉండే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# చిర్ర గోనె.. పిల్లల ఆటలో దాగిన ఆనందం, చురుకుదనం



డెస్క్, ఫిబ్రవరి 6,మన గళం: బాల్యంలో చిర్ర గోనె ప్రత్యేక గుర్తింపు ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల ఆటలంటే చిర్ర గోనె తప్పనిసరిగా గుర్తుకు వచ్చేది. ఖాళీ స్థలాల్లో, బడి మైదానాల్లో, సాయంత్రం వేళ పిల్లలు గుంపులుగా చేరి ఆడే ఈ ఆట బాల్యంలో విడదీయలేని భాగంగా ఉండేది. ఖరీదైన ఆటబొమ్మలు లేకపోయినా, కొద్దిపాటి సామగ్రితో ఆడే చిర్ర గోనె పిల్లలకు అపారమైన ఆనందాన్ని ఇచ్చేది. నేటి డిజిటల్ యుగంలో ఈ ఆట మెల్లగా కనుమరుగవుతున్నా, ఒక తరం బాల్య జ్ఞాపకాల్లో మాత్రం చిర్ర గోనె ఇప్పటికీ జీవిస్తోంది.

– ఆటతో పాటు శారీరక చురుకుదనం

చిర్ర గోనె ఆట పిల్లల శరీరానికి మంచి వ్యాయామంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పరుగులు తీయడం, దూకడం, సమతుల్యం పాటించడం వంటి చర్యల వల్ల కాళ్ల బలం పెరుగుతుందని, శరీర చురుకుదనం మెరుగుపడుతుందని పేర్కొంటున్నారు. ఈ ఆట ఆడే సమయంలో పిల్లలు సహజంగానే కదలికల్లో పాల్గొంటారు కాబట్టి అలసట తెలియకుండా వ్యాయామం పూర్తవుతుందని చెబుతున్నారు. చిన్న వయసులోనే శారీరక చురుకుదనం అలవాటు అయితే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు దూరంగా ఉంటాయని నిపుణుల అభిప్రాయం.

– మనసుకు ఆనందం, స్నేహబంధాల బలోపేతం

చిర్ర గోనె కేవలం శరీరానికే కాదు, మనసుకూ మేలు చేసే ఆటగా గుర్తింపు పొందింది. గెలుపుఓటములను కలిసి అనుభవించడం, స్నేహితులతో నవ్వులు పంచుకోవడం వల్ల పిల్లల్లో సామాజిక నైపుణ్యాలు పెరుగుతాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. జట్టు భావన, సహనం, ఓర్పు వంటి విలువలు ఈ ఆట ద్వారా సహజంగా అలవడతాయని పేర్కొంటున్నారు. నేటి కాలంలో పిల్లలు ఒంటరిగా మొబైల్ ఆటల్లో మునిగిపోతున్న వేళ, చిర్ర గోనె వంటి ఆటలు కలిసి ఆడే సంస్కృతిని గుర్తు చేస్తాయని వారు అంటున్నారు. సంప్రదాయ ఆటలను నిలబెట్టాల్సిన అవసరం చిర్ర గోనె వంటి సంప్రదాయ ఆటలు పిల్లల సమగ్ర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాలలు, తల్లిదండ్రులు పిల్లలను ఇలాంటి ఆటల వైపు ప్రోత్సహిస్తే శారీరక, మానసిక ఆరోగ్యం రెండూ మెరుగవుతాయని చెబుతున్నారు. ఆధునిక ఆటలతో పాటు సంప్రదాయ ఆటలకు కూడా స్థానం కల్పిస్తేనే బాల్యం సంపూర్ణంగా మారుతుందని వారు సూచిస్తున్నారు. చిర్ర గోనె కేవలం ఒక ఆట మాత్రమే కాదు, ఒక తరం బాల్యాన్ని గుర్తు చేసే జీవంత సంస్కృతి అని పెద్దలు గుర్తుచేస్తున్నారు.

## పెద్దవాళ్ల మనసు.. మాటలకన్నా ఎక్కువ భావాలు దాచుకున్న ప్రపంచం



డెస్క్, ఫిబ్రవరి 6,మన గళం: అనుభవాల బరువు మోసే మనసు

పెద్దవాళ్ల మనసు అనేది అనుభవాలతో నిండిన ఒక నిశ్శబ్ద ప్రపంచమని మానసిక నిపుణులు చెబుతున్నారు. జీవితంలో ఎన్నో బాధ్యతలు, కష్టాలు, విజయాలు చూసిన వారు కావడంతో వారి ఆలోచనలు లోతుగా ఉంటాయని పేర్కొంటున్నారు. చిన్న విషయాలకు వెంటనే స్పందించకుండా మౌనంగా ఉండటం, మాటలు తక్కువగా మాట్లాడటం చాలామందికి కనిపిస్తుంటుంది. అది నిర్లక్ష్యం కాదు, అనుభవం నేర్పిన సంయమనం అని నిపుణులు అంటున్నారు.

– మౌనం వెనుక దాగి ఉన్న భావోద్వేగాలు

పెద్దవాళ్లు తమ బాధలను, ఒంటరితనాన్ని బయటకు చెప్పుకోకుండా లోపలే దాచుకుంటారని మానసిక వైద్యులు చెబుతున్నారు. పిల్లలపై భారం పడకూడదన్న భావనతో, తమ సమస్యలను చిన్నవిగా తీసుకుని మౌనంగా భరించే స్వభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. మారుతున్న కాలానికి, మారుతున్న విలువలకు సరిపోలేకపోవడం వల్ల కొంతమందిలో బాధ, అసంతృప్తి పెరుగుతుందని కూడా వారు సూచిస్తున్నారు. ఈ మౌనం చాలాసార్లు ఒంటరితనానికి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు.

– గౌరవం, ప్రేమే వారికి పెద్ద బలం

పెద్దవాళ్లకు అవసరమైనది పెద్ద మాటలు కాదు, చిన్న శ్రద్ధ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. రోజూ కొద్దిసేపు మాట్లాడటం, వారి మాటలను శ్రద్ధగా వినడం, నిర్ణయాల్లో భాగస్వాములుగా భావించడం వల్ల వారి మనసుకు ఎంతో ఆనందం కలుగుతుందని పేర్కొంటున్నారు. కుటుంబంలో గౌరవం, ప్రేమ దొరికితే పెద్దవాళ్లు మానసికంగా ఎంతో బలంగా ఉంటారని, ఆరోగ్యంపై కూడా దాని ప్రభావం ఉంటుందని నిపుణుల అభిప్రాయం.

– తరం మధ్య స్నేహమే పరిష్కారం

పెద్దవాళ్ల మనసును అర్థం చేసుకోవాలంటే తరం మధ్య సంభాషణ అవసరమని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు, యువత వారి అనుభవాలను వినడం ద్వారా జీవన విలువలు నేర్చుకుంటారని, పెద్దవాళ్లు కూడా మారుతున్న కాలాన్ని అర్థం చేసుకునే అవకాశం పొందుతారని చెబుతున్నారు. పరస్పర గౌరవం, ఓర్పు, ప్రేమతో కూడిన సంభాషణ ఉంటే పెద్దవాళ్ల మనసు ప్రశాంతంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. చివరికి పెద్దవాళ్ల మనసు అనేది గట్టిగా కనిపించినా, లోపల మాత్రం ప్రేమ, ఆదరణ కోసం ఎదురుచూస్తున్న సున్నితమైన హృదయమేనని నిపుణులు గుర్తుచేస్తున్నారు.

## రాగిజావా.. సంప్రదాయ పోషకాహారం, ఆరోగ్యానికి బలమైన ఆధారం



డెస్క్, ఫిబ్రవరి 6 ,మన గళం: గ్రామీణ ప్రాంతాల్లో రాగిజావా తరతరాలుగా ప్రధాన పోషకాహారంగా కొనసాగుతోంది. ఉదయం అల్పాహారంగా లేదా పనికి వెళ్లే ముందు తాగితే రోజంతా శక్తిని అందించే ఆహారంగా పెద్దలు దీనిని అలవాటు చేసుకున్నారు. ఆధునిక కాలంలో ఫాస్ట్ ఫుడ్ ప్రభావంతో రాగిజావా కొంతకాలం వెనక్కి వెళ్లినా, ఇప్పుడు మళ్లీ ఆరోగ్య ఆహారంగా గుర్తింపు పొందుతోందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. సహజమైనది, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండటం దీనికి ఉన్న ప్రత్యేకతగా పేర్కొంటున్నారు.

– కాల్షియం, ఫైబర్‌తో శరీర బలం

రాగుల్లో కాల్షియం, ఐరన్, ఫైబర్ అధికంగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎముకలు బలపడటానికి, దంతాల ఆరోగ్యానికి రాగిజావా ఎంతో మేలు చేస్తుందని సూచిస్తున్నారు. పిల్లల ఎదుగుదలకు, మహిళల్లో ఎముకల బలహీనత నివారణకు, వృద్ధుల్లో కీళ్ల సమస్యలు తగ్గించుకోవడానికి ఇది ఉపకరిస్తుందని పేర్కొంటున్నారు. ఫైబర్ ఎక్కువగా ఉండటంతో జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం సమస్యలు తగ్గుతాయని కూడా చెబుతున్నారు.

– షుగర్, బరువు నియంత్రణకు అనుకూలం

రాగిజావాకు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటంతో షుగర్ ఉన్నవారికి ఇది అనుకూలమైన ఆహారమని వైద్యులు సూచిస్తున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించడంలో ఇది సహాయపడుతుందని చెబుతున్నారు. అలాగే ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచడం వల్ల బరువు నియంత్రణలో కూడా రాగిజావా తోడ్పడుతుందని నిపుణుల అభిప్రాయం. డైట్‌లో ఉన్నవారు ఉదయం రాగిజావాను అలవాటు చేసుకుంటే మేలు జరుగుతుందని సూచిస్తున్నారు.

– సరైన తయారీ, పరిమితి అవసరం

రాగిజావాను సరైన విధానంలో తయారు చేయడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. రాగులను బాగా శుభ్రపరిచి, నానబెట్టి, పులియబెట్టిన తర్వాత జావాగా చేసుకుంటే పోషకాలు మెరుగుగా అందుతాయని సూచిస్తున్నారు. ఉప్పు లేదా తీపి మోతాదును పరిమితంగా ఉంచుకోవాలని, రోజుకు ఒకసారి లేదా అవసరాన్ని బట్టి తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. సంప్రదాయ రాగిజావాను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి శక్తి, ఆరోగ్యం రెండూ లభిస్తాయని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## 13 ఏళ్లుగా ఒక్క సినిమా చేయలేదు..



హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026,మన గళం: ఒకప్పుడు భారతీయ సినీ ప్రపంచంలో టాప్ హీరోయిన్‌గా వెలుగొందిన నటి జూహి చావ్లా ఇప్పుడు సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ సంపద పరంగా దేశంలోనే అత్యంత ధనిక నటీమణుల్లో ఒకరిగా నిలుస్తోంది. చిన్న వయసులోనే నటిగా అడుగుపెట్టిన ఆమె అప్పట్లో యూత్ ఫేవరేట్ క్రష్‌గా మారింది. స్టార్ హీరోలతో వరుసగా నటిస్తూ బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్న జూహి చావ్లా కోసం ఒకప్పుడు హీరోలే క్యూ కట్టే పరిస్థితి ఉండేది.

1986లో ధర్మేంద్ర నటించిన చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన జూహి చావ్లాకు 1988లో ఆమిర్ ఖాన్‌తో కలిసి చేసిన చిత్రం పెద్ద గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆ తర్వాత హిందీతో పాటు ఇతర భాషల్లోనూ వరుస చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొంభైయవ దశకంలో ఆమెకు ఉన్న క్రేజ్ వేరే స్థాయిలో ఉండేది. అయితే కెరీర్ మంచి ఊపులో ఉన్నప్పుడే వివాహం చేసుకుని, క్రమంగా సినిమాలకు దూరమైంది.

గత పదమూడు సంవత్సరాలుగా ఆమె ఒక్క హిట్ సినిమాలోనూ నటించలేదు. ఇటీవలి సంవత్సరాల్లో థియేటర్లలో విడుదలైన చిత్రాల్లో ఆమె కనిపించకపోవడంతో అభిమానులు కూడా ఆశ్చర్యపోతున్నారు. అయినప్పటికీ సినీరంగానికి దూరంగా ఉన్నా జూహి చావ్లా ఆర్థికంగా అత్యంత బలమైన స్థాయికి చేరుకుంది. హురున్ రిచ్ లిస్ట్ నివేదికల ప్రకారం ఆమె సంపద సుమారు 4600 కోట్ల రూపాయల వరకు ఉందని సమాచారం.

సినిమాల ద్వారా వచ్చే ఆదాయం కంటే వ్యాపారాలు, పెట్టుబడుల ద్వారానే ఆమెకు ప్రధానంగా సంపాదన వస్తోంది. రియల్ ఎస్టేట్ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టడంతో పాటు క్రికెట్ జట్లలోనూ భాగస్వామిగా ఉంది. షారుఖ్ ఖాన్‌తో కలిసి కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో పెట్టుబడి పెట్టిన ఆమెకు ఆ జట్టు విలువ పెరుగుతున్న కొద్దీ సంపద కూడా పెరుగుతోంది. అదేవిధంగా సినిమా నిర్మాణ సంస్థల్లో భాగస్వామ్యం, ఇతర వ్యాపారాలు కూడా ఆమె సంపద పెరుగుదలకు కారణమయ్యాయి.

ముంబై, గుజరాత్ ప్రాంతాల్లో ఖరీదైన బంగ్లాలు, రెస్టారెంట్లు ఉండటంతో పాటు విలాసవంతమైన కార్ల కలెక్షన్ కూడా ఆమె వద్ద ఉంది. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ జూహి చావ్లా జీవితం మాత్రం విలాసవంతంగా కొనసాగుతోంది. ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన ఈ నటి ఇప్పుడు వ్యాపారవేత్తగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవడం సినీ ప్రపంచంలో ఆసక్తికర అంశంగా మారింది.

# శ్రుతిహాసన్ బాటలో మరో స్టార్ హీరోయిన్..



### పవన్ కళ్యాణ్ సినిమాపైనే యంగ్ బ్యూటీ ఆశలన్నీ!



హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026 ,మన గళం: ఆమె అడుగు పెడితే థియేటర్లో డ్యాన్సుల జాతర మొదలవుతుంది. తన ఎనర్జీతో, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారు గుండెల్లో సెన్సేషన్ సృష్టించిన యంగ్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కాస్త క్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. తక్కువ కాలంలోనే టాలీవుడ్ క్రేజీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఆమె ఒకేసారి అరడజనుకు పైగా సినిమాలు చేస్తూ బిజీయెస్ట్ హీరోయిన్‌గా మారింది. అయితే దురదృష్టవశాత్తూ ఆమె నటిస్తున్న చాలా సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయాయి. స్టార్ హీరోల సరసన నటించినా సరైన బ్లాక్‌బస్టర్ హిట్ పడకపోవడంతో సోషల్ మీడియాలో ఆమెపై విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

తెలుగు, తమిళం, హిందీ భాషల్లో వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ టాలీవుడ్‌లో మాత్రం శ్రీలీల కెరీర్ కొంత అయోమయంలో పడిందనే చర్చ సాగుతోంది. ఇటీవల రవితేజతో కలిసి చేసిన 'మాస్ జాతర' సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో ఆమెపై మరింత ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ఆమెకు కెరీర్ టర్నింగ్ పాయింట్ అవుతుందనే ఆశలు పెంచుకుంది. శ్రీలీల పరిస్థితిని చూస్తుంటే గతంలో శ్రుతిహాసన్ ఎదుర్కొన్న దశ గుర్తుకు వస్తోంది. శ్రుతిహాసన్ కూడా కెరీర్ ప్రారంభంలో వరుస పరాజయాలతో 'ఐరన్ లెగ్' అనే విమర్శలు ఎదుర్కొన్నారు. అదే సమయంలో హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ నటించిన 'గబ్బర్ సింగ్' సినిమాలో అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ ఒక్కసారిగా మలుపు తిరిగింది. ఆ సినిమా ఘనవిజయం సాధించడంతో శ్రుతిహాసన్ టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఎదిగారు. ఇప్పుడు అదే దర్శకుడు హరీష్ శంకర్, అదే హీరో పవన్ కళ్యాణ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా కూడా శ్రుతిహాసన్ తరహాలో తన కెరీర్‌ను తిరిగి గాడిలో పెట్టుతుందనే నమ్మకంతో శ్రీలీల ఉంది. మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## దిల్ రాజు చేతికి 'టాక్సిక్'.. బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్'కి యష్ గట్టి పోటీ!




హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026,మన గళం:కన్నడ స్టార్ నటుడు యష్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్యాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' తెలుగు రాష్ట్రాల పంపిణీ హక్కులకు సంబంధించి భారీ డీల్ కుదిరింది. ఈ సినిమా థియేట్రికల్ హక్కులను టాలీవుడ్ అగ్ర నిర్మాత, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు రికార్డు ధరకు సొంతం చేసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో 'టాక్సిక్' పంపిణీ హక్కులను సుమారు రూ. 120 కోట్లకు దక్కించుకున్నట్లు ట్రేడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. డబ్బింగ్ సినిమాకు ఇంత భారీ మొత్తంలో డీల్ జరగడం ఇదే తొలిసారి కావడంతో ఈ ఒప్పందం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

మార్చి 19న 'టాక్సిక్' ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే రోజు బాలీవుడ్ నుంచి భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన రణ్‌వీర్ సింగ్ చిత్రం 'ధురంధర్ 2' కూడా థియేటర్లలోకి రాబోతుండటంతో బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఖాయంగా కనిపిస్తోంది. ఈ రెండు పెద్ద సినిమాల క్లాష్ కారణంగా మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే ఈ పోటీ ప్రభావంతో అడివి శేష్ నటించిన 'డెకాయిట్' చిత్రం తన విడుదల తేదీని మార్చి 19 నుంచి ఏప్రిల్ 10కు మార్చుకున్నట్లు సమాచారం.

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న 'టాక్సిక్' పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో యష్‌కు జోడీగా నయనతార, కియారా అద్వానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. భారీ బడ్జెట్, యష్ స్టార్‌డమ్, దిల్ రాజు డిస్ట్రిబ్యూషన్ కలిసిరావడంతో తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్' బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి సంచలనం సృష్టిస్తుందో చూడాలి

## అర్జున్ దర్శకత్వంలో 'సీతా పయనం'..




హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026 ,మన గళం: యాక్షన్ కింగ్ అర్జున్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన విభిన్న కథా చిత్రం 'సీతా పయనం' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాతో అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ వెండితెరకు కథానాయికగా పరిచయం అవుతోంది. నిరంజన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ కీలక పాత్రల్లో కనిపించనుండగా, అర్జున్ స్వయంగా ఓ ప్రత్యేక పాత్రలో మెరవనున్నారు. అలాగే ఆయన మేనల్లుడు ధ్రువ సర్జా కూడా ఈ చిత్రంలో ప్రత్యేక పాత్రలో దర్శనమివ్వనున్నారు. ప్రేమికుల రోజు కానుకగా ఈ సినిమాను ఫిబ్రవరి 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తికాగా, సెన్సార్ కార్యక్రమాలు కూడా ముగిశాయి. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే హృద్యమైన కథతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు చిత్రబృందం చెబుతోంది.



ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీగా విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను జి. బాలమురుగన్ నిర్వర్తించగా, సాయి మాధవ్ బుర్రా పదునైన సంభాషణలు అందించారు. యాక్షన్ సన్నివేశాలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రేక్షకుల్లోకి వెళ్తున్న మేకర్స్ త్వరలోనే థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 14న విడుదల కానున్న 'సీతా పయనం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని సాధిస్తుందో చూడాలి

## ఆస్ట్రేలియాకు బిగ్ షాక్.. స్టార్ పేసర్ ఔట్




సిడ్నీ 06 ఫిబ్రవరి 2026,మన గళం : టీ20 ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియా జట్టుకు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. గాయంతో బాధపడుతున్న జోష్ హేజిల్‌వుడ్ టోర్నమెంట్ మొత్తానికి దూరమయ్యాడు. ఇప్పటికే ప్యాట్ కమిన్స్ గాయంతో బయటకు వెళ్లగా మిచెల్ స్టార్క్ రిటైర్మెంట్ తీసుకున్న నేపథ్యంలో కీలక పేస్ బౌలర్లు లేకుండానే ఆస్ట్రేలియా బరిలోకి దిగాల్సి వస్తోంది. సూపర్ ఎనిమిది దశకు వచ్చే సరికి హేజిల్‌వుడ్ కోలుకుంటాడని యాజమాన్యం తొలుత ఆశించింది. కానీ తాజా వైద్య నివేదికల ప్రకారం అతడు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధించడానికి ఇంకా సమయం పడనుంది. తొందరపడి మైదానంలోకి దింపితే గాయం మళ్లీ ముదిరే ప్రమాదం ఉందని జట్టు వైద్య బృందం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో హేజిల్‌వుడ్‌ను పక్కన పెట్టాలని సెలెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ అంశంపై జాతీయ సెలక్టర్ మాట్లాడుతూ ఆటగాడి ఆరోగ్యం ప్రధానమని స్పష్టం చేశారు. పూర్తిగా కోలుకోకుండా ఆడించడం వల్ల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం అతడి స్థానంలో కొత్త ఆటగాడిని చేర్చే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని, అవసరాన్ని బట్టి తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇదే సమయంలో కెప్టెన్ స్పందిస్తూ జట్టులో ప్రతిభావంతులైన సీమర్లకు కొదవలేదని ధీమా వ్యక్తం చేశాడు. ఆల్‌రౌండర్లు బౌలింగ్ బాధ్యతలు భుజాన వేసుకునే స్థాయిలో ఉన్నారని, పరిస్థితులకు అనుగుణంగా జట్టును సమతూకంగా సిద్ధం చేస్తామని అన్నాడు. కీలక పేస్ బౌలర్లు లేకపోయినా సమిష్టి ప్రదర్శనతో ముందుకు వెళ్లాలని జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.

## వైభవ్ శతక విధ్వంసం.. నాలుగొందలు కొట్టిన టీమిండియా..!



హరారే 06 ఫిబ్రవరి 2026,మన గళం : అండర్–19 ప్రపంచకప్ ఫైనల్లో భారత యువ జట్టు బ్యాటర్లు ఇంగ్లండ్ బౌలర్లపై విధ్వంసం సృష్టించారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన శతకంతో భారత ఇన్నింగ్స్‌కు పునాది వేశాడు. ఆరంభంలో ఆరోన్ జార్జ్ త్వరగానే వెనుదిరిగినా, వైభవ్ ఆకాశమే హద్దుగా చెలరేగి బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 55 బంతుల్లోనే శతకం పూర్తి చేసిన అతడు, ఇన్నింగ్స్ మొత్తం మీద 175 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లకు వెన్నులో వణుకు పుట్టించాడు. వైభవ్‌కు కెప్టెన్ ఆయుష్ మాత్రే బాధ్యతాయుతమైన అర్ధ శతకంతో చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి భాగస్వామ్యం జట్టును భారీ స్కోర్ దిశగా నడిపించింది. వైభవ్ వెనుదిరిగిన తర్వాత విహాన్ మల్హోత్రా, వేదాంత్ త్రివేది కీలక భాగస్వామ్యంతో స్కోర్‌బోర్డును ముందుకు నడిపించారు. మధ్య ఓవర్లలో కొద్దిసేపు స్కోరింగ్ రేటు తగ్గినప్పటికీ, చివరి దశలో అభిగ్యాన్ కుందు వేగంగా పరుగులు రాబట్టుతూ ఇన్నింగ్స్‌కు మళ్లీ ఊపు తెచ్చాడు. డెత్ ఓవర్లలో కనిష్క్ చౌహన్ మెరుపు ఇన్నింగ్స్‌తో టీమిండియాను నాలుగు వందల పరుగుల మైలురాయికి చేర్చాడు. చివరి ఓవర్లలో వరుస బౌండరీలతో స్కోర్‌ను మరింత పెంచడంతో భారత జట్టు ప్రత్యర్థికి 412 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ నుంచి టెయిల్ ఎండ్ వరకు బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో భారత్ ఘనమైన స్థితిలో నిలిచింది. ఇప్పుడు ఇంగ్లండ్ ముందు ఈ భారీ లక్ష్యాన్ని చేధించడం ఎంతటి కఠినమైన సవాలుగా మారుతుందో చూడాల్సిందే.

## టీ20 ప్రపంచకప్ 2026.. అందరి కళ్లూ ఈ 10 మంది ఆటగాళ్లపైనే!



హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026 ,మన గళం : రేపటి నుంచి భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మెగా టోర్నీలో ఈసారి పిచ్‌ల స్వభావం కూడా కీలక పాత్ర పోషించనుంది. భారత్‌లో బ్యాటింగ్‌కు అనుకూలమైన మైదానాల్లో పరుగుల వరద పారే అవకాశం ఉండగా, శ్రీలంకలో నెమ్మదైన వికెట్లపై స్పిన్నర్లు మ్యాచ్‌లను శాసించే పరిస్థితి కనిపిస్తోంది.

పొట్టి ఫార్మాట్‌లో పవర్‌ప్లేలో దూకుడు, మిడిల్ ఓవర్లలో నియంత్రణ, డెత్ ఓవర్లలో ఒత్తిడిని జయించే సామర్థ్యమే మ్యాచ్ ఫలితాన్ని తేల్చనుంది. గత ప్రపంచకప్‌లను పరిశీలిస్తే.. కొద్దిమంది ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనలే టోర్నీ దిశను మార్చేశాయి. ఈ నేపథ్యంలో ఈసారి ప్రపంచకప్‌లో ప్రత్యేకంగా గమనించాల్సిన 10 మంది కీలక ఆటగాళ్లపై అందరి దృష్టి నెలకొంది. భారత జట్టు నుంచి అభిషేక్ శర్మ పవర్‌ప్లేలో విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను ఒత్తిడిలోకి నెట్టగలడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అనుభవంతో కీలక క్షణాల్లో జట్టుకు ఆధారంగా నిలుస్తాడు. వరుణ్ చక్రవర్తి తన స్పిన్‌తో మధ్య ఓవర్లలో మ్యాచ్‌ను మలుపుతిప్పే శక్తి కలిగిన బౌలర్‌గా నిలుస్తున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా డెత్ ఓవర్లలో తన యార్కర్లు, వెరైటీ బంతులతో ఏ బ్యాటింగ్ లైనప్‌నైనా కట్టడి చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి ప్రణాళికలను భగ్నం చేయగలడు. శ్రీలంక స్పిన్ సంచలనం వనిందు హసరంగ స్వదేశీ పిచ్‌లపై అత్యంత ప్రమాదకరంగా మారనున్నాడు. దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ క్వింటన్ డి కాక్ పవర్‌ప్లేలో మ్యాచ్‌ను తన వైపుకు తిప్పే ఆటగాడు. ఇంగ్లండ్ తరఫున ఫిల్ సాల్ట్ దూకుడైన ఆటతో బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేయగలడు. ఆఫ్ఘనిస్థాన్ జట్టుకు రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెన్నెముకగా నిలవగా, అజ్మతుల్లా ఒమర్జాయ్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ కీలక పాత్ర పోషించనున్నాడు. మొత్తం మీద ఈ టీ20 ప్రపంచకప్ శక్తి, వ్యూహాల మధ్య సాగే ఉత్కంఠభరిత పోరుగా మారనుంది. ఈ 10 మంది ఆటగాళ్ల ప్రదర్శన టోర్నీ గమనాన్ని శాసించే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, అభిమానులందరి చూపు వీరిపైనే నిలిచింది

## అండర్19 ఫైనల్లో సూర్యవంశీ తుఫాన్ శతకం..



హరారే 06 ఫిబ్రవరి 2026 ,మన గళం : అండర్19 ప్రపంచకప్ 2026 ఫైనల్‌లో భారత యువ జట్టు పరుగుల వరద సృష్టిస్తోంది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తుది పోరులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అద్భుత ఫామ్‌లో చెలరేగుతూ కేవలం 55 బంతుల్లోనే శతకం సాధించి ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు.

ఇన్నింగ్స్ ఆరంభంలో 20 పరుగుల వద్ద ఓపెనర్ ఆరోన్ జార్జ్ వికెట్‌ను కోల్పోయిన భారత్ కాస్త తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన వైభవ్ సూర్యవంశీ కెప్టెన్ ఆయుష్ మాత్రేతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఇంగ్లండ్ బౌలర్లపై దూకుడుగా ఆడిన ఈ జోడీ రెండో వికెట్‌కు 142 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. కెప్టెన్ ఆయుష్ 53 పరుగులతో ఔటైనా.. మరోవైపు వైభవ్ మాత్రం పరుగుల వరద పారించాడు. బౌండరీల మోత మోగిస్తూ మైదానం నలువైపులా షాట్లు సంధించిన వైభవ్ సూర్యవంశీ ప్రత్యర్థి బౌలర్లను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాడు. ఆరు ఓవర్ల పవర్‌ప్లే నుంచే వేగం పెంచిన అతడు స్ట్రైక్ రేట్ దాదాపు 190కి చేరేలా బ్యాటింగ్ చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో అలెక్స్ గ్రీన్ రెండు వికెట్లు పడగొట్టినప్పటికీ.. మిగతా బౌలర్లు వైభవ్ ధాటికి తట్టుకోలేకపోయారు. తాజా సమాచారం ప్రకారం 22 ఓవర్లలో భారత్ రెండు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ సెంచరీ దాటిన తర్వాత కూడా దూకుడును కొనసాగిస్తూ భారీ స్కోరు దిశగా జట్టును తీసుకెళ్తున్నాడు. ఇంకా చాలా ఓవర్లు మిగిలి ఉండటంతో భారత్ మూడువందల యాభై పరుగులకు పైగా స్కోరు సాధించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

## టీమిండియా క్రికెటర్ రింకు సింగ్ ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్..




అలీగఢ్ 06 ఫిబ్రవరి 2026,మనగళం : టీమిండియా యువ క్రికెటర్, ఐపీఎల్ స్టార్ రింకు సింగ్ ఫేస్‌బుక్ ఖాతా సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కింది. బిజీ క్రికెట్ షెడ్యూల్ కారణంగా కొంతకాలంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేకపోవడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రింకు సోదరుడు సోను సింగ్ ఫిర్యాదు మేరకు అలీగఢ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మ్యాచ్‌లు, టోర్నీలతో బిజీగా ఉన్న రింకు సింగ్ గత కొన్ని నెలలుగా తన ఫేస్‌బుక్ ఖాతాను ఉపయోగించలేదు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు అతడి ఖాతాను హ్యాక్ చేసినట్లు తెలుస్తోంది. ఖాతా ఎప్పటి నుంచి హ్యాకింగ్‌కు గురైందనే విషయంపై స్పష్టత లేకపోయినా.. అనుమానం కలగడంతో రింకు సోదరుడు పోలీసులను ఆశ్రయించాడు.

ఫిర్యాదు అందుకున్న అలీగఢ్ సైబర్ క్రైమ్ విభాగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. హ్యాకర్లను గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలపై ఆరా తీస్తోంది. హ్యాక్ చేసిన ఖాతా ద్వారా ఎలాంటి ఆర్థిక మోసాలు జరిగాయా..? ఎవరికైనా నష్టం వాటిల్లిందా..? అనే కోణంలోనూ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో సోషల్ మీడియా ఖాతాల భద్రతపై మళ్లీ చర్చ మొదలైంది. ప్రముఖులు తమ అకౌంట్లకు అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు

## పొట్టి ప్రపంచకప్‌లో వీరబాదుడు..

హైదరాబాద్ 06 ఫిబ్రవరి 2026 ,మన గళం : రేపటి నుంచి పదో సీజన్ టీ20 ప్రపంచకప్ సందడి ప్రారంభం కానుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో ఇరవై జట్లు ట్రోఫీ కోసం బరిలోకి దిగుతున్నాయి. పొట్టి ఫార్మాట్ అంటేనే విధ్వంసకర బ్యాటింగ్‌కు పెట్టింది పేరు. అలాంటి ఫార్మాట్‌లో జరిగే ప్రపంచకప్‌లో పవర్ హిట్టర్లు మరింత ఉగ్రరూపం దాల్చుతూ శతకాలతో అభిమానులను ఉర్రూతలూగిస్తుంటారు. ఈ ఐసీసీ ఈవెంట్ చరిత్రలో ఇప్పటివరకు మొత్తం 11 సెంచరీలు నమోదయ్యాయి. భారత్ తరఫున సురేశ్ రైనా ఒకే ఒక్కడిగా శతకం సాధించడం విశేషం. 2007లో తొలిసారి నిర్వహించిన టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ దక్షిణాఫ్రికాపై విధ్వంసం సృష్టించాడు. కేవలం 57 బంతుల్లోనే 117 పరుగులు చేస్తూ పది సిక్సర్లు, ఏడు ఫోర్లతో ప్రత్యర్థి బౌలర్లకు చెమటలు పట్టించాడు. అదే ఎడిషన్‌లోనే పొట్టి ప్రపంచకప్‌లో తొలి శతకం నమోదు అయింది. 2010 ప్రపంచకప్‌లో భారత్‌కు చెందిన సురేశ్ రైనా గ్రాస్ ఇస్లెట్ మైదానంలో దక్షిణాఫ్రికాపై అద్భుత శతకం సాధించాడు. అరవై బంతుల్లో తొమ్మిది ఫోర్లు, ఐదు సిక్సర్లతో వంద పరుగులు పూర్తి చేసి టీ20 ప్రపంచకప్‌లో శతకం చేసిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అదే ఎడిషన్‌లో శ్రీలంక వెటరన్ మహేల జయవర్ధనే జింబాబ్వేపై శతకంతో మెరిశాడు. 2012లో న్యూజిలాండ్ స్టార్ బ్రెండన్ మెక్‌కల్లమ్ బంగ్లాదేశ్‌పై తనదైన విధ్వంసంతో శతకం సాధించాడు. అనంతరం ఇంగ్లండ్ ఓపెనర్ అలెక్స్ హేల్స్ శ్రీలంకపై, పాకిస్థాన్ బ్యాటర్ అహ్మద్ షెహజాద్ బంగ్లాదేశ్‌పై, తమీమ్ ఇక్బాల్ ఒమన్‌పై శతకాలు సాధిస్తూ పొట్టి ప్రపంచకప్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. 2016 ఎడిషన్‌లో మరోసారి క్రిస్ గేల్ ఇంగ్లండ్‌పై అజేయ శతకంతో చెలరేగాడు. ఆ తర్వాతి ఎడిషన్లలో జోస్ బట్లర్ శ్రీలంకపై, రీలే రసో బంగ్లాదేశ్‌పై, గ్లెన్ ఫిలిప్స్ శ్రీలంకపై శతకాలతో మెరిశారు. గత ఎడిషన్‌లో మాత్రం ఒక్క సెంచరీ కూడా నమోదు కాలేదు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో పాటు శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మలు కూడా ఈ




ఫార్మాట్‌లో సెంచరీలు సాధించిన అనుభవం కలిగిన ఆటగాళ్లే కావడంతో, ఈసారి పొట్టి ప్రపంచకప్‌లో మరోసారి శతకాల వర్షం కురిసే అవకాశం ఉందని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.